
# సాక్షి మంచిర్యాల

గురువారం । 2 । మార్చి । 2023



### తీరనున్న దారి కష్టాలు

అంగ్రాజ్‌పల్లి నుంచి అన్నారం బ్యారేజీ, ముత్త రావుపల్లి వైపు ప్రయాణికులకు దారి కష్టాలు తీరనున్నాయి. రూ.6.08 కోట్లు మంజూరు కావడంతో తారు రోడ్డు వేయించారు. 8లో▸



### తిప్పేశ్వర్‌కు చేరిన పులులు

ఇటీవల రోడ్డుపై కనిపించిన నాలుగు పులులు తిప్పేశ్వర్‌కు చేరాయి. పెన్‌గంగ దాటి తిప్పేశ్వర్ అభయారణ్యం వైపు వెళ్లినట్లు అధికారులు ధ్రువీకరించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /19.0

### వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. వేడి గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### కంటి వెలుగు శిబిరం సందర్శించిన విప్



పరీక్షలు చేయించుకుంటున్న విప్ సుమన్

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లిలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ బుధవారం సందర్శించారు. శిబిరంలో ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు నిర్వహించిన శిబిరాల వివరాలతోపాటు ఎంతమందికి కంటి పరీక్షలు నిర్వహించారనే విషయాలపై చర్చించారు. ప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తాను స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### సాగు నీరందించాలని ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న రైతులు, నాయకులు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని పంటలకు కడెం ప్రాజెక్టు కాలువ నీరు, గూడెం ఎత్తిపోతల పథకం నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చేస్తున్నా ఎమ్మెల్యే, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పక్కనే గోదావరిలో, ఎల్లంపల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా రెండు కిలోమీటర్ల దూరంలో పంటలు ఎండిపోతున్నాయని, 200కిలోమీటర్ల దూరంలోని గజ్వేల్, సిద్దిపేటలో వరిపొలాలకు నీరందిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధు, లక్సెట్టిపేట మండల రైతులు పాల్గొన్నారు.


### నేడు జిల్లా బంద్‌కు కాంగ్రెస్ పిలుపు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

**మంచిర్యాలటౌన్:** దండేపల్లి మండలం గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు నివాసంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్టు ఆయకట్టు పంట పొలాలకు సాగు నీరు ఇవ్వకపోవడం వల్ల ఎండిపోతున్నాయని అన్నారు. గత రెండు రోజులుగా రైతులు నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 'రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ'



మద్దతుగా దీక్షలో కూర్చున్న సురేఖ

**దండేపల్లి:** రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. కడెం ఆయకట్టుతోపాటు గూడెం ఎత్తిపోతల ద్వారా ప్రస్తుత యాసంగికి పూర్తిస్థాయిలో సాగునీరందకపోవడంతో దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష బుధవారం రెండో రోజుకు చేరింది. దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ పార్టీ, రైతు నాయకులకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాటాల్డుతూ సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకం పైపులైన్‌పై ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు దీక్ష కొనసాగుతుందని తెలిపారు. జెడ్పీటీసీ నాగరాణి, ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, కాంగ్రెస్ సర్పంచ్‌లు, చంద్రకళ, పుష్పలత, శంకరయ్య, శాంతయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, నవీన్, మాలిక, హేమలత, మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, సతీష్, దుర్గప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

# 'ఉమర్ మియా'లో మరో మోసం



**ఈయన** మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన మల్క నగేశ్. 2012లో ఉమర్ మియా సొసైటీలో 355.55చదరపు గజాలు ఉన్న 66వ నంబరు ప్లాటును కొనుగోలు చేశాడు. ఇటీవల ప్లాటు చుట్టూ ప్రహరీ వేయాలని ప్రయత్నించగా ఓ వ్యక్తి వచ్చి ఇది తన ప్లాటు అని చెప్పడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇదే ప్లాట్‌ను 1985లోనే వేరొకరికి అమ్మేశారు. ఆయన 2021లో మరొకరి అమ్మారు. ముందు కొనుగోలు చేసిన వారికే డాక్యుమెంట్ ఉంది. దీంతో బాధితుడికి ఏం చేయాలతో తెలియక, ప్లాటు అమ్మిన సొసైటీ పెద్దల వద్దకు వెళ్తే మొదట వేరే చోట ప్లాట్ ఇప్పిస్తామని నమ్మబలికారు. ఆ తర్వాత అడిగితే స్పందించడం లేదని వాపోతున్నాడు. దీనిపై జిల్లా కలెక్టర్‌తో సహా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిన ప్లాటు

- ఒకే ప్లాట్‌కు డబుల్ రిజిస్ట్రేషన్లు
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- హౌసింగ్ సొసైటీ పేరుతో అక్రమాలు
- విచారణ చేసి చర్యలు తీసుకోని సహకార శాఖ?

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** ఉమర్ మియా హౌసింగ్ సొసైటీలో మోసాలు ఇంకా బయటపడుతూనే ఉన్నాయి. సొసైటీ పేరుతో భూమి లేకున్నా నాటకమాడి రూ.కోట్ల విలువైన భూముల్లో రియల్ వ్యాపారం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఒకే ప్లాట్‌కు రెండుసార్లు రిజిస్ట్రేషన్లు చేసి కొనుగోలుదారులను వంచించారు. ఈ సొసైటీలో ప్లాట్ కొనుగోలు చేసిన జిల్లా కేంద్రం మంచిర్యాలకు చెందిన మల్క నగేశ్ తనకు జరిగిన మోసంపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు చేసిన ప్లాట్ల బాధితులు ఇంకా ఉన్నప్పటికీ వేరే చోట ప్లాట్లు ఇప్పిస్తామని సొసైటీ పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు వ్యక్తులు నమ్మిస్తున్నట్లు సమాచారం. మరోవైపు సొసైటీలో ఒకే వ్యక్తి పేరుతో 11ప్లాట్లు, మరో ఐదు ప్లాట్లు తమకు తెలిసిన వారి పేర్లతో ఉన్నాయి.

**సొసైటీ పేరుతో నమ్మించి..**

జిల్లా కేంద్రం మంచిర్యాలలోని చున్నం బట్టివాడ పరిధి శ్రీశ్రీనగర్‌లోని సర్వే నంబర్లు 474/ఏ, 476/బీలో మొత్తం 12.21ఎకరాల పట్టా భూమిలో ఏళ్లుగా వివాదం ఉంది. పట్టాదారులు ఎస్‌ఏ హామీద్, దళితుల మధ్య వివాదం కొనసాగుతోంది. 1979లో అప్పటి నిర్మల్ ఆర్డీవో వేలంలో నలుగురు వ్యక్తులు ఈ భూమి కొనుగోలు చేసినట్లు, సొసైటీ పేరుతో 86ప్లాట్లుగా ఖరీదు చేసినట్లు చూపుతూ అనేక రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ఈ వేలం జరిగినట్లు ఇప్పటికీ ఎటువంటి ఆధారం లభ్యం కాలేదు. 1978లో ఎస్‌ఏ హామీద్ పేరుతో అప్పటి సాగు భూమిని నివాస స్థలాలుగా మార్చేందుకు మంచిర్యాల మున్సిపాలిటీకి లే అవుట్‌కు దరఖాస్తు వచ్చింది. కానీ అప్పుడు ఆ దరఖాస్తు ఆమోదం పొందలేదు. కానీ 2014లో అంటే 36ఏళ్ల తర్వాత వ్యక్తి పేరుతో ఇచ్చిన దరఖాస్తును ఉమర్‌మియా కాలనీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరు మీదుగా స్థానిక మున్సిపాలిటీ అనుమతి ఇచ్చింది. దీంతో అప్పటి నుంచి ఈ భూముల్లో రూ.కోట్ల రియల్ దందా జరిగింది. వాస్తవానికి వేలం పాట జరిగే ఏడాది ముందే సొసైటీ 1978లోనే రిజిస్ట్రేషన్ జరిగింది. కానీ ఇవన్నీ కొనుగోలుదారులు ఎవరికీ తెలియకుండా విక్రయాలు జరిగాయి. కనీసం సొసైటీ సభ్యులే కాకుండా ఇతర వ్యక్తులకు భూములు అమ్మారు. ఇక పాలకవర్గం గడువు 2016లోనే ముగిసినప్పటికీ 2020వరకు రిజిస్ట్రేషన్లు సొసైటీ పేరుతో జరిగాయంటే ఆయా శాఖల అధికారులు ఎంతగా 'సహకారం' అందించారో అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఒకరిద్దరు ఇళ్లు కట్టుకోగా, మిగతా చోట్ల నిర్మాణాలు ఆపాలంటూ ప్రతివాదులు కోర్టుకు వెళ్లడంతో అనుమతులు ఆగిపోయాయి. అయితే కోర్టు ఆదేశాలు సైతం ధిక్కరిస్తూ, ఇంటి నంబర్లు, నిర్మాణానికి అనుమతులు కూడా అప్పట్లో పని చేసిన ఇద్దరు కమీషనర్లు తీరు వివాదాస్పదమైంది.

**పట్టించుకోని సహకార శాఖ**

తమ శాఖ పరిధిలో సొసైటీ పేరుతో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తూ బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా సహకార శాఖ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ సొసైటీ గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపి రెండేళ్ల క్రితమే ఓ నివేదిక ఇచ్చారు. అనేక అక్రమాలు జరిగాయని విచారణ అధికారి తన రిపోర్టులో స్పష్టంగా ఇచ్చారు. ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు కరువయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తాజాగా మరోసారి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో చర్యలు తీసుకుంటారా? లేదా ?అని తేలాల్సి ఉంది.

## మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

**మందమర్రిరూరల్:** మందమర్రి పట్టణంలోని ప్రజలు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణంలో నెలకొన్న సమస్యలు, వీధి కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు పని చేయకపోవడం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలపై ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోరవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

నేడు
మందమర్రి మున్సిపల్ కమిషనర్
గద్దె రాజు



సంప్రదించాల్సిన నంబర్ :
99497 03181

సమయం : గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

## పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

- 15న మంత్రి హరీష్‌రావు రాక
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- కలెక్టర్, సీపీలతో సమీక్ష సమావేశం



మ్యాప్ పరిశీలిస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్

**చెన్నూర్:** చెన్నూర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు సర్వం సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఈ నెల 15న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు రానున్న దృష్ట్యా బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ జోడువాగుల వద్ద అంబేద్కర్ అర్బన్ ఏకో పార్క్, రూ.2.50 కోట్లతో నిర్మించిన కేసీఆర్ పార్క్, రూ.25 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైటింగ్, రూ.9 కోట్లతో నిర్మించిన రెండు మినీ ట్యాంక్‌బండ్‌లు, రూ.5 కోట్లతో నిర్మించిన మినీ స్టేడియం మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. రూ.1.50 కోట్లతో నిర్మించనున్న సమ్మక్క, సారలమ్మ మహిళా భవన్, రూ.40 కోట్లతో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రి, బస్సు డిపోలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, అభయహస్తం, తునికాకు కార్మికుల బోనస్ చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో 20 వేల మందితో ఏర్పాటు చేసే సభలో హరీశ్‌రావు ప్రసంగిస్తారని అన్నారు. అనంతరం అధికారులతో కలిసి అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, డీఆర్‌డీవో శేషాద్రి, ఎఫ్‌డీవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఈఈ స్వామి, ఈఈ పీఆర్ ప్రకాశ్, ఏసీపీ నరేందర్, తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ఆర్టీసీ డీఎం అరవింద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## రూ.15.08 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**చెన్నూర్:** చెన్నూర్ మున్సిపాలిటీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.15.08 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

**క్యాతనపల్లి మున్సిపాలిటీలో..**

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూ.22.46కోట్ల బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, జేఏఓ అనితాదేవి, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, ఏఈ అచ్యుత్ పాల్గొన్నారు.

# 'సిలిండర్' బాదుడు

- గృహావసరాల గ్యాస్ ధర రూ.50 పెంపు
- కమర్షియల్ గ్యాస్‌కు రూ.354 పెంపు
- భారంగా మారుతున్న ధరలు



**మంచిర్యాలటౌన్:** నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపుతో మరింత భార పడింది. ఏడాదిలో మూడు నాలుగు సార్లు గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పోతుండగా.. సబ్సిడీ అందడం లేదు. ప్రతి నెలా గ్యాస్ ధరలు ఎప్పుడు పెరుగుతాయోననే ఆందోళన కనిపిస్తోంది. 2020 మార్చిలో రూ.880.50గా ఉన్న గృహావసరాలకు వినియోగించే 14 కేజీల గ్యాస్ సిలిండర్ ధర 2021 మార్చి నాటికి రూ.893కు పెరిగింది. 2022 మార్చిలో రూ.1,023.50కు చేరింది. రెండు మూడు నెలలకు ఒకసారి గ్యాస్ ధరలు పెరుగుతూ ఈ ఏడాది మార్చి నాటికి రూ.1,127 కాగా, కేంద్రం రూ.50 పెంచడంతో ప్రస్తుతం గృహావసరాల గ్యాస్ సిలిండర్ ధర రూ.1,177 అయ్యింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,013.50 ఉండగా రూ.354 పెంపుతో రూ.2,367కు చేరింది. ప్రతి ఏటా గ్యాస్ భారం ప్రజలపై అధికం అవుతుండడం, సబ్సిడీ డబ్బులు రూ.40 వరకే ఇస్తుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం పడుతోంది.

**జిల్లా ప్రజలపై రూ.1.33 కోట్ల భారం**

గృహావసరాలకు వినియోగించే గ్యాస్ ధరలను రూ.50 పెంచడంతో జిల్లావ్యాప్తంగా ఉన్న వినియోగదారులపై రూ.1,33,98,950 పడుతోంది. గ్యాస్ సబ్సిడీని రూ.40 వరకు కొన్నింటికి ఇస్తుండగా, మరికొన్నింటికి చెల్లించడం లేదు. సామాన్య ప్రజానీకానికి పెరుగుతున్న ధరలు భారంగా మారుతుండగా, గ్యాస్ డెలివరీ పేరిట అదనపు వసూళ్లు మరింతగా ఇబ్బందిగా మారుతోంది. ఇక కమర్షియల్ సిలిండర కనెక్షన్లు జిల్లావ్యాప్తంగా 6 వేల వరకు ఉండగా, హోటళ్లు, చిరువ్యాపారులు వీటిని వినియోగిస్తుంటారు. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో చిరు వ్యాపారులకు భారంగా మారనుంది.

**జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు**

| | |
|---|---|
| మొత్తం సిలిండర్లు | 2,67,979 |
| సింగిల్ | 1,22,087 |
| డబుల్ | 65,347 |
| దీపం పథకం | 47,324 |
| ఉజ్వల పథకం | 12,619 |
| సీఎస్‌ఆర్ | 20,602 |
| **గృహావసరాల సిలిండర్ ధర ఇలా..** | |
| 2020 మార్చి | రూ.880.50 |
| 2021 మార్చి | రూ.893 |
| 2022 మార్చి | రూ.1,023.50 |
| 2023 మార్చి | రూ.1,177 |

**పెంచుతూ పోతున్నారు**



వంటగ్యాస్ ధరలు పెంచుతూ పోతుంటే భారం పడుతోంది. ఇప్పుడు ఎంతో కొంత ఇచ్చే సబ్సిడీని కూడా సక్రమంగా రావడం లేదు. గ్యాస్ ధరలు ఎప్పుడు ఎంతమేరకు పెంచుతారో తెలియడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సబ్సిడీని ఇచ్చినా, కొంత భారం తగ్గుతుంది అనుకుంటే ఆ సబ్సిడీని ఇవ్వకపోవడం, భారం ఎక్కువ అవుతోంది.

– మాసు ఇందిర, గృహిణి, మంచిర్యాల

**గ్యాస్ వాడకుండా చేస్తున్నారు**



వంట గ్యాస్ ధరలను పెంచి గ్యాస్‌ను వినియోగించకుండా చేస్తున్నారు. గతంలో కట్టెల పొయ్యిని వాడుతుండే.. ఈ ధరలు ఇలాగే పెంచుకుంటూ పోతే మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు అవుతదేమో. మాకు వచ్చే ఆదాయం పెరగడం లేదు, కానీ ధరలు ఇలా పెరుగుతూ పోతే నెల నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

– గుడికందుల సత్యవతి, గృహిణి, మంచిర్యాల

## ఆహార విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ విజయపూర్ణిమ
- జిల్లావ్యాప్తంగా 3,042 మంది రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న డాక్టర్ విజయ పూర్ణిమ

**మంచిర్యాలటౌన్:** జిల్లాలో ఆహార పదార్థాలు, వాటి తయారీకి సంబంధించిన అమ్మకాలు సాగించే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లైసెన్స్‌లు తీసుకోవాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ విజయపూర్ణిమ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఘన, ద్రవ పదార్థాలను విక్రయించే వారు రూ.12లక్షలలోపు వ్యాపారం ఉంటే రిజిస్ట్రేషన్, రూ.12లక్షలకు పైగా వ్యాపారం ఉంటే లైసెన్స్ తీసుకోవాలని చట్టంలో ఉందని తెలిపారు. పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని జిల్లాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లను ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్‌గా గత ఏడాది నవంబర్‌లో నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 3,382మంది ఆహార వ్యాపారం చేస్తున్నట్లుగా గుర్తించామని, ఇందులో 231 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 205మంది లైసెన్స్ కలిగి ఉన్నారని, 2,946మందికి అనుమతులు లేవని వివరించారు. రిజిస్ట్రేషన్, లైసెన్స్ మేళాలు నిర్వహించడం, దుకాణాలకు వెళ్లి అవగాహన కల్పించడంతో జిల్లా వ్యాప్తంగా 3,042మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 302మంది లైసెన్స్ తీసుకున్నారని వివరించారు. మిగతా వారు వారం రోజుల్లో అనుమతి తీసుకోవాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. రూ.100తో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఆహారానికి సంబంధించిన ఫిర్యాదులు http://foscos.fssai.gov.in వెబ్‌సైట్‌లో చేయవచ్చని తెలిపారు. సమావేశంలో ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**బెల్లంపల్లి:** ఐసీడీఎస్ వ్యవస్థను ప్రైవేటీకరించే యత్నాలను ప్రభుత్వం బేషరతుగా విరమించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి కె.సునీత డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బెల్లంపల్లిలో అంగన్‌వాడీలు ఏఎంసీ క్రీడా మైదానం నుంచి పుర వీధుల మీదుగా ఐసీడీఎస్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత లేకపోగా కనీసం చట్టబద్ధ సౌకర్యాల కల్పనలో కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలు తీర్చకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.రమణ, రంజి త్‌కుమార్, భానుమతి, రాజమణి, శంకరమ్మ, అనురాధ, రాజేశ్వరి, మహేశ్వరి, సువర్ణ, భాగ్యలక్ష్మి, స త్యవతి, శారద, రాధబాయి, విజయలక్ష్మి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌సెంటర్ పరిశీలన



విద్యార్థులతో రాష్ట్ర కో–ఆర్డినేటర్ పద్మ

**మంచిర్యాలఅర్బన్:** జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌ను జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) రాష్ట్ర కో–ఆర్డినేటర్ పద్మ బుధవారం పరిశీలించారు. జిల్లా సైన్స్ కేంద్రంలోని జిజ్ఞాస మొబైల్ వాహనం, వినూత్నంగా విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న విజ్ఞాన అంశాలను పరిశీలించారు. వేసవిలో విద్యార్థుల కోసం ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడాన్ని అభినందించారు. జాతీయ స్థాయి విజ్ఞాన మేళా, ఇన్‌స్పైర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్, ప్లానింగ్ ఆఫీసర్ రాజేందర్, డీఈవో వెంకటేశ్వర్లు, డీఎస్‌వో మధుబాబు పాల్గొన్నారు.

## బీఆర్క్ ఫలితాల్లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

**బెల్లంపల్లి:** జాతీయ స్థాయి పోటీ పరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జేఈఈ మెయిన్స్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) పరీక్ష ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన బీఆర్క్ ఫలితాల్లో పొట్టాల విష్ణు 97.8, అల్లూరి శివప్రసాద్ 95.5 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, జేవీపీ దాసం అజిత, శ్రీరామవర్మ, రమేష్, లక్ష్మీనారాయణ, సురేష్‌గౌడ్, కట్ల రవీందర్, సుంకరి అర్జున్ పాల్గొన్నారు. కాగా, సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఫోన్‌లో ప్రశంసించారు.

**నిరుపేద కూలీల బిడ్డలు..**

బీఆర్క్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మెరిసిన ఇద్దరు విద్యార్థులు నిరుపేద వ్యవసాయ కూలీల బిడ్డలు. కోటపల్లి మండలం పుల్లగామ గ్రామానికి చెందిన పొట్టాల సారక్క, తిరుపతి దంపతుల కుమారుడు విష్ణు, అదే మండలంలోని జనగామ గ్రామానికి చెందిన అల్లూరి లక్ష్మి, రాజన్న దంపతుల కుమారుడు శివకుమార్ అత్యుత్తమ పర్సంటైల్‌తో ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు.

## క్లుప్తంగా

### ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి


మౌనిక(ఫైల్)

దండేపల్లి: మండలంలోని కర్ణపేటకు చెందిన అజ్మీరా మౌనిక (28) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వివాహిత బుధవారం మృతిచెందింది. ఏఎస్సై పాల్ కథనం ప్రకారం... మౌనిక గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. కడుపునొప్పి భరించలేక గత నెల 14న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మేదరిపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. మౌనికకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి రాజునాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### జోరుగా బెల్లం, పటిక అమ్మకాలు


దండేపల్లి: గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక విక్రయాలు దండేపల్లి మండలం మేదరిపేట కేంద్రంగా జోరుగా సాగుతున్నాయి. కాసిపేట, కొండపూర్, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట, శ్రీరాములపల్లె, లక్ష్మీకాంతపూర్, మాదాపూర్, లింగాపూర్, అల్లీపూర్, గుడిరేవు, కొళ్లపెల్లి, బిక్కనగూడ, మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి గ్రామాలతోపాటు గిరిజన గ్రామాలైన దమ్మన్నపేట, కంచరబాయి గ్రామాల ప్రజలు ప్రతినిత్యం మేదరిపేటకు వచ్చి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. 15గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉండడంతో అనేక రకాల దుకాణాలు ఉన్నాయి. మేదరిపేట సమీప గ్రామాల్లో కొందరు గుడుంబా తయారు చేస్తుండడంతో బెల్లం, పటిక అమ్మకాలు ఇక్కడ ఎక్కువగా సాగుతున్నాయి. పలువురు వ్యాపారులు బెల్లం, పటిక అమ్మకాలపై దృష్టి సారించి లోడ్ల కొద్ది తెప్పించి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకుని దుకాణాల్లో విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు తనిఖీలు నామమాత్రంగా ఉండడంతో బెల్లం, పటిక అమ్మాకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

### చేపల వలకు చిక్కి జాలరీ మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

తాండూర్: మండలంలోని ద్వారకపూర్ గ్రామ శివారు పరిధిలోని చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ జాలరీ అనూహ్యంగా మృతి చెందాడు. ఎస్సై బి.సమ్మయ్య వివరాల ప్రకారం ... మండల కేంద్రానికి చెందిన కంపెల బాపు (62) బుధవారం ద్వారకపూర్‌లోని రాముని చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. చెరువులో దిగి చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చేపల వల చుట్టుకుని చెరువులో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నీటి మడుగులో పడి ఒకరి మృతి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని సవాతి పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని సవాతి గ్రామ పంచాయతీ పరిధిలోని బండకాస గ్రామానికి చెందిన బిర్కుర్‌వార్ విలాస్ (50) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం సోయం సోనేరావు అనే వ్యక్తి పంట చేనుకు వెళ్తుండగా వాగు మడుగులో విలాస్ మృతదేహం కనిపించింది. దీంతో అతడి సమాచారం మేరకు పోలీసులు చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

### దివ్యాంగుల ఉపాధికి యూనిట్ల కేటాయింపు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాసం పథకం కింద రూ.16.50 లక్షల విలువైన 28 యూనిట్లు కేటాయించగా, దరఖాస్తు గడువును ఈ నెల 6వరకు పెంచినట్లు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వైకల్య శాతం 40 ఉండాలని, వయస్సు 21 నుంచి 55ఏళ్లలోపు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతల వారికి రూ.2 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలని, వివరాలకు దివ్యాంగుల టోల్ ఫ్రీ నం .155326లో సంప్రదించాలని తెలిపారు.

# తీరనున్న 'దారి' కష్టాలు


అంగ్రాజ్‌పల్లి నుంచి అన్నారం బ్యారేజీ వైపు వెళ్లే రోడ్డు దుస్థితి(ఫైల్)

- అంగ్రాజ్‌పల్లి నుంచి అన్నారం బ్యారేజ్, ముత్తరావుపల్లి వరకు నిర్మాణం
- రూ.6.08కోట్లు మంజూరు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సహకారంతో తీరనున్న ప్రజల ఇక్కట్లు


ప్రస్తుతం అంగ్రాజ్‌పల్లి నుంచి అన్నారం బ్యారేజీ వైపు వెళ్లే దారిలో పూర్తయిన బీటీ రోడ్డు

చెన్నూర్‌రూరల్: భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో ఆ వైపుగా ఆర్టీసీ బస్సును సైతం నిలిపివేశారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలల్లో రాకపోకలు కొనసాగించారు. ఇది మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామ సమీపం నుంచి దుగ్నెపల్లి, సుందరసాల అన్నారం బ్యారేజీ వైపు వెళ్లే రహదారి పరిస్థితి. సుమారుగా ఏడేళ్ల క్రితం అన్నారం బ్యారేజీ పనుల నిమిత్తం సామగ్రి తీసుకొచ్చేందుకు భారీ వాహనాల రాక పోకలతో రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుబ్బరాంపల్లి, నారాయణపూర్ మీదుగా తిరిగి ప్రయాణం కొనసాగించారు. అలాగే చెన్నూర్ నుంచి ఆర్టీసీ బస్సు రాక పోకలు ఎర్రగుంటపల్లి, కొమ్మెర మీదుగా చుట్టూ తిరిగి అన్నారం బ్యారేజీ అవతల వైపు ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం వరకు రాక పోకలు సాగిస్తుంది. దీంతో దూరభారం పెరిగింది.

**తీరనున్న కష్టాలు...**

ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహకారంతో అంగ్రాజ్‌పల్లి నుంచి దుగ్నెపల్లి, సుందరసాల మీదుగా అన్నారం బ్యారేజీ వరకు అలాగే ముత్తరావుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6.08 కోట్లను మంజూరు చేయించారు. దీంతో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు కూడా సాగుతున్నాయి. అంగ్రాజ్‌పల్లి నుంచి దుగ్నెపల్లి గ్రామ సమీపం వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. అలాగే సుందరసాల, అన్నారం బ్యారేజీ, ముత్తరావుపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు కష్టాలు దూరం కానున్నాయి.

### ప్రభుత్వ విప్ సహకారంతో



ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రజలు ఇబ్బందులు పడొద్దని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తవుతుంది. దీంతో ప్రజల దారి కష్టాలు తొలగనున్నాయి.

–మంత్రి బాపు, ఎంపీపీ, చెన్నూర్

### ప్రజల కష్టాలు దూరం



అంగ్రాజ్‌పల్లి నుంచి దుగ్నెపల్లి, సుందరసాల మీదుగా అన్నారం బ్యారేజీ వరకు అలాగే ముత్తరావుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ప్రజల కష్టాలు దూరం అవుతాయి. ప్రభుత్వ విప్ సుమన్ సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

–మోతె తిరుపతి, జెడ్పీటీసీ, చెన్నూర్

# డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో కన్వేయన్స్ కాంట్రాక్ట్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ అతర్ హుస్సేన్‌ను అకారణంగా బుధవారం విధుల నుంచి తొలగించడం సరికాదని, అతడిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధితుడికి మద్దతుగా జీఎం క్వాలిటీ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హుస్సేన్ ఐదేళ్లుగా కాంట్రాక్ట్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. పది నెలలుగా క్వాలిటీ జీఎం అల్లి రాజేశ్వర్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడని వివరించారు. సదరు జీఎం, అతడి కుటుంబ సభ్యులు డ్రైవర్‌ను సొంత ఇంటి పనులకు వాడుకున్నారని ఆరోపించారు. దీంతో హుస్సేన్ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురయ్యాడని వివరించారు. డ్రైవర్‌గా మాత్రం విధులు నిర్వహిస్తానని చెప్పడంతో అతడిని తొలగించారని మండిపడ్డారు. వెంటనే జీఎం రాజేశ్వర్‌రావుపై విచారణ చేసి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శివ, కె.సతీష్, వినయ్, అఖిల్, రాజేందర్ పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభలు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): భూపాలపల్లి జిల్లాలో మార్చి 5వ తేదీన నిర్వహించే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహా సభలను ఏరియాలోని కాంట్రాక్టు కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి కోరారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానం చేసి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించటం జరుగుతుందన్నారు. ప్రధానంగా కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, హైపర్ కమిటీ వేతనాలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వంటి అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. గోలేటిలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయటంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఏరియా లోని సివిక్, సీహెచ్‌పీ, ఓబీ, ఓసీపీలలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, నర్సరీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోలేటి బ్రాంచి నూతన కమిటీని ఎన్నుకున్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, కిరణ్‌బాబు, ఫిట్ కార్యదర్శులు రాజేష్ పాల్గొన్నారు.

**ఎన్నికైన నూతన కమిటీ**

కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గోలేటిబ్రాంచి గౌరవ అధ్యక్షుడిగా భయ్య మొగిళి, ఇన్‌చార్జిగా బి.జగ్గయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా సాగర్‌గౌడ్, ధన్‌రాజ్, కోశాధికారిగా వేణు, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, శేఖర్, చరణ్, బండి స్వామి, సమ్మయ్య, కిరణ్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

# కాంట్రాక్టు కార్మికుడిపై తేనెటీగల దాడి


చంద్రయ్యను పరామర్శిస్తున్న కేంద్ర కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో బుధవారం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడిపై తేనె టీగలు దాడి చేశాయి. కార్మికుల వివరాల ప్రకారం... సీహెచ్‌పీ రైల్వే ట్రాక్ మెయింటనెన్స్ విభాగంలో పనిచేస్తున్న పెరుగు చంద్రయ్య ఉదయం విధి నిర్వహణలో భాగంగా బంకర్ వద్ద పని చేస్తుండగా ఒక్కసారిగా తేనె టీగలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో అతడిని గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి బోగే ఉపేందర్ డిస్పెన్సరీకి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికులకు రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు.

# బీపీఏలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి


వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో ఫిబ్రవరిలో 92 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిందని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. బుధవారం గోలేటిటౌన్‌షిప్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి నెలకు ఏరియాకు 3.4లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి కైరిగూడ ఓసీపీ ద్వారా 3.12 టన్నులు సాధించి 92 శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు తెలిపారు. కైరిగూడ ఓసీపీ నెలవారి ఉత్పత్తి లక్ష్యం 3లక్షల టన్నులకు గత నెలలో 3.12లక్షలు సాధించి 104 శాతం నమోదు చేసిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బెల్లంపల్లి ఏరియా ఇప్పటి వరకు 76 శాతం ఉత్పత్తితో ముందుకు సాగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న నెల రోజులను సద్వినియోగం చేసుకుంటూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేదించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఏరియాలో ఇప్పటి వరకు 1131 సీపీఆర్ఎంఎస్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం కేహెచ్ఎన్ గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

### రాక్ క్లైంబింగ్ ట్రైనింగ్‌లో జిల్లా విద్యార్థులు


ట్రైనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాక్ క్లైంబింగ్ ట్రెనింగ్ క్యాంపులో జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నట్లు వార్డెన్ మధుకర్ బుధవారం తెలిపారు. యదాద్రి భవనగిరి జిల్లాలోని భువనగిరి కోటపై రాక్ క్లెమ్బింగ్ క్యాంప్‌ను ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ట్రెనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు అద్భుత ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు.

# విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా, ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ చాంబర్ నుంచి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రతిభ ప్రోత్సాహక పరీక్షల్లో భాగంగా ప్రతీ పాఠశాల నుంచి సమ్మేటివ్-1, ప్రీ ఫైనల్-1లో మెరుగైన ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థుల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్ డివిజన్లలో ఈ నెల 11న ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు, మెరిట్ సర్టిఫికేట్ అందజేస్తామని తెలిపారు. డీఈవో వెంకటేశ్వర్లు, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రెటరీ భీంరావ్, అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

# వందశాతం ఉత్పత్తి సాధించిన ఆర్‌కే 5 గని


కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌కే 5 గని కార్మికులు నిర్ణీత సమయం కంటే ముందే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు ఆర్‌కే 5 అండ్ 6 గనుల గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ తెలిపారు. బుధవారం గనిపై నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 2022–23 సంవత్సరానికి ఉత్పత్తి లక్ష్యం 2లక్షలా 70వేలా 321 టన్నుల లక్ష్యాన్ని మార్చి 31కి చేరుకోవాల్సి ఉండగా నెల రోజుల ముందుగానే సాధించినట్లు తెలిపారు. ఇది కేవలం గని కార్మికుల సమష్టి కృషితోనే సాధ్యమైందని వివరించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, రక్షణ అధికారి శివయ్య, గ్రూప్ ఇంజనీర్ వీరన్న, అధికారులు రాందాస్, సందీప్, రాజేశ్, ఎల్లయ్య, హేమంత్, ఫిట్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పనితీరు మెరుగుపరుచుకోవాలి


సన్మాన సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్: ప్రతి ఉద్యోగి తమ పనితీరును మెరుగుపరచుకుని సంస్థ లాభాల బాట పట్టేలా కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆదిలాబాద్ డిపోను సందర్శించిన ఆయన విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రతి ఉద్యోగి ఎంతో కష్టపడి పని చేస్తారని కితాబిచ్చారు. రీజియన్‌ తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రీజియన్ పరిధిలోని ప్రతీ డిపో లాభాలను ఆర్జించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగుల విధి నిర్వహణపైనే సంస్థ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కే. జానీరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. సురేష్ చౌహాన్, డిపో మేనేజర్ కె. కల్పన, నిర్మల్, బైంసా, ఆసిఫాబాద్ డిపో మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- నిందితుల పేర్లు వెల్లడించడంలో గోప్యం
- పోలీసుల వ్యవహారంపై భిన్నాభిప్రాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఠా వ్యవహారాన్ని ఛేదించిన పోలీసులు బుధవారం వారిని అరెస్టు చేశారు. అయితే నిందితుల పేర్లు మాత్రం అత్యంత గోప్యంగా ఉంచారు. ఈనెల 25న కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామపంచాయతీ గెర్రెగూడకు చెందిన ఓ యువతి అదృశ్యం కాగా ఆ యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నెల 26న సదరు యువతి కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ కంగన్ హాల్ దుకాణంలో ఇద్దరు యువకులతో కనిపించడంతో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గుర్తించి బాధిత కుటుంబీకులకు సమాచారం అందించాడు. వెంటనే కుటుంబీకులు, గ్రామస్తులు కాగజ్‌నగర్‌కు చేరుకుని సదరు యువతితో పాటు ఇద్దరు యువకులను పట్టుకుని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీంతో పోలీసులు వారిని విచారించగా పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. దీంతో బుధవారం ఆ ముఠా సభ్యులైన నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కానీ వారి పేర్లు మాత్రం బయటకు పొక్కకుండా ఉంచడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజును ‘సాక్షి’ వివరణ కోరగా సున్నితమైన కేసు కావడంతో వివరాలు వెల్లడించలేకపోతున్నామని పేర్కొన్నారు.

### బాబ్లీ గేట్లు ఎత్తి నీటి విడుదల


బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు

భైంసా: గోదావరి నదిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు బుధవారం ఎత్తి నీటిని దిగువన తెలంగాణలోకి వదిలారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు నీటిని వదిలారు. ఏటా గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడంతోపాటు పశుపక్ష్యాదుల దప్పిక తీర్చేందుకు ఒకరోజు నీటిని విడుదల చేసి గేట్లు మూసివేస్తారు. సీడబ్ల్యూసీ ఈఈ శ్రీనివాస్‌రావు, నాందేడ్ ఈఈ ఏఎస్ చొగలే, డీఈఈ ఆర్ఆర్ పాటదార్, ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ ఉన్నారు.

### బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

సిర్పూర్(టి): మండలంలోని కోనేరు కాలనీ సమీపంలో కౌటాల– సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన సేగంటి సత్తయ్య(52) కౌటాల నుంచి సిర్పూర్(టి)కి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. సిర్పూర్(టి) నుంచి కౌటాలకు చెందిన పెట్కర్ సురేష్, మూర్కర్ సురేష్ బైక్‌పై వెళ్తుండగా కోనేరు కాలనీ సమీపంలో ఎదురుదెరుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సత్తయ్య తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మైత్రి కేంద్రాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆదిలాబాద్ ఆధీనంలో మైత్రి కేంద్రాల ఏర్పాటుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం సహాయ సంచాలకులు ఆర్.రామారావు తెలిపారు. మల్టీపర్పస్ అర్టిఫీషియల్ అన్సెమిషన్ టెక్నీషియన్ ఇన్ రూరల్ ఇండియా (ఎంఎఐటీఆర్ఐ) కింద కృత్రిమ గర్భధారణ కోసం శిక్షణ ఇప్పించి, సామగ్రి ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల్లో రైతుల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాల్సి ఉంటుందని, ఎటువంటి వేతనాలు ఉండవని, స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని చెన్నూర్ మండలంలోని చింతపల్లి, భీమిని మండలంలోని గంగారాం, దుగ్నెపల్లి, సుద్దాల, తెనుగుపల్లి, కర్జీభీంపూర్ రాజారాం, జైపూర్ మండలంలోని ఇందారం, తాండూర్ పెగడపల్లి, నస్పూర్, చంద్రవెల్లి, జన్నారం మండలంలోని అబ్బాపూర్, కవ్వాల్‌లలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 10వ తరతగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 35 సంవత్సరాల వయసు వారు కావాలని తెలిపారు. ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణపత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, అభ్యర్థులు సంబంధిత కేంద్ర సమీప గ్రామస్తులై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 13 సాయంత్రం 5 గంటలలోగా కార్యనిర్వహణ అధికారి/ సహాయ సంచాలకులు, పశుసంవర్ధశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యాలయం, భుక్తాపూర్ ఆదిలాబాద్‌లో అందజేయాలని కోరారు.

### అడవుల్లో మంటలు


దగ్ధమవుతున్న అడవి

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి శివారులోని ఖానాపూర్–పెంబి వెళ్లే రహదారిలోని అడవిలో బుధవారం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎఫ్ఆర్‌వో వినాయక్ ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయించారు. నిప్పుపెట్టిన వారి కోసం గాలిస్తున్నామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్ఆర్‌ఓ వినాయక్ తెలిపారు.